# సమాధిలోంచి లేచిన జ్ఞానం

చుట్టూ ఎటుచూసినా కొండలే. పచ్చటి అడవులతో కళకళ్లాడుతున్న కొండలు. ఆ కొండల మధ్యనించి వంపులు తిప్పుకుంటూ ఒయ్యారాలొలక బోసుకుంటూ కట్ట దగ్గర దక్షిణంగా ప్రవహిస్తున్న సెలయేరు. కొత్త వానలకి జలపాతమై కొండలతో అడవులతో గొంతు కలిపి పాడుతున్నట్టుంది. ఆ జలపాతం ఘోషకి అడవి జంతువులు సైతం భయపడినట్టున్నాయి. రోజూ రాత్రిపూట వినిపించే వాటి అరుపులు ఏవీలేవు. వర్షపు మేఘాలు మళ్లీ దట్టంగా ముసురుకుంటున్నాయి. దాంతో కాళరాత్రే అయింది. జలపాతానికి ఆనుకునే పాతికగజాలు ఎడంగా కొండగుహ. మహావృక్షాల్లాంటి రెండు కొండరాళ్ల మీద పరుచుకున్న పరుపురాయివల్ల ఆ గుహ ఏర్పడింది. ఓ వందమంది జనం సదుపాయంగా కూర్చోవటానికి వీలుగా విశాలంగా మూడువేపులా మూసుకుపోయి తూర్పుదిక్కుగా తెరచుకున్న ఆ గుహలో ఒకప్పుడు చిరుతపులులు ఉండేవని అక్కడ జనం చెప్పుకుంటారు. ఆ కొండగుహ ఎదురుగా తూర్పుకి తాటికమ్మల పైకప్పుతో ఏర్పాటుచేసిన యాగశాల. ఆ యాగశాలలో తీగకి వేలాడుతున్న హరికేన్‌లాంతరు, మత్తులో ఉన్న మనిషిలాగ తనలో తాను నిమగ్నమైపోయినట్టుంది.

యాగశాల మధ్యలో నిత్యాగ్నిహోత్రం. ఆ సమీపంలో పద్మాసనంలో కూర్చుని ఉన్న సాధువు శరీరం రక్తవర్ణంలో మెరుస్తున్నది. మెడలో వేలాడుతున్న రుద్రాక్షమాల. ప్రక్కనే కమండలం. సాధువు అంతరేక్షణలో ధ్యానముద్రలో ఉన్నారు. అగ్నికుండానికి

ఓ ప్రక్క పుష్పమాలాలంకృత త్రిశూలం నిలబడి ఉంది.

'భగవాన్' అని నిట్టూరుస్తూ, 'వచ్చేశాను స్వామీ' అని సీతారామయ్య యాగశాలలోకి అడుగుపెట్టాడు. వర్షంలో మొత్తంగా తడిసిపోయినా వర్షానికి లెక్క చెయ్యని మొండితనంతో పెద్దవయసు సీతారామయ్య హుషారుగా ఉన్నాడు. ఖద్దరు లాల్చీ, కావిరంగు పంచె తడిసి ఒంటికి అతుక్కున్నాయి. వాటిని ఓసారి ఒంటిమీదనే పిండుకుని, పొడితువ్వాలు తీసుకుని తలాఒళ్లూ తుడుచుకుని, లాల్చీ తీసేసి మరోసారి 'వచ్చేశాను స్వామీ' అన్నాడు. ఇంత పెద్ద వర్షానికి సైతం భయపడకుండా రాత్రికి ఆశ్రమానికి చేరుతాడో లేదో అన్న సందేహంతో పాటు ఎట్లా అయితేనేం పని సాధించుకుని రాగలిగినందుకు తననితనే ప్రశంసించుకుంటున్న గొంతు ఆ మాటల్లో వినిపించసాగింది.

అగ్నిహోత్రం వెలుగుతో యాగశాలంతా నిండి ఉంది. అగ్నికుండంలో రెండు పెద్దపెద్ద కట్టెమానులు మండుతున్నాయి. కింద నిప్పులు ఎర్రెర్రగా మణుల్లా మెరుస్తున్నాయి. ఆ వెలుగూ, ఆ వెచ్చదనం యాగశాలంతటా పరుచుకుని వెచ్చగా ఆహ్లాదకరంగా ఉంది. అగ్నికుండానికి పదడుగులు పడమరగా జుత్తునెరిసి గెడ్డం పెరిగిన మరోసాధువుగారు మంచంలాంటి బల్లమీద మేనువాల్చి చూస్తున్నారు.

సీతారామయ్య వారినుద్దేశించే స్వామీ అని సంబోధించి మాట్లాడుతున్నాడు. ఈ మధ్యాహ్నం మాలచ్చిమి వచ్చి చెప్పిన ఇంటివిషయాలన్నీ విన్నతర్వాత సీతారామయ్యపట్ల ఉన్న అభిమానం సందేహాస్పదమైంది. సీతారామయ్య ముఖంలోని సంతోషాన్ని ప్రశ్నార్థకంగా ఆయన చూస్తున్నారు. చల్లని వర్షపు సుడిగాలులు విజృంభించి యాగశాలను వణికించేస్తున్నాయి.

యాగశాలకు ఆనుకునే కొండగుహ. ఆ గుహకు దక్షిణంగా జలపాతంపై ఒరుగుతున్న సెలయేరు ముందుకు సాగి తూర్పుగా ప్రవహిస్తున్నది.

ధుని దగ్గర జితేంద్రియులై అంతరేక్షణలో పద్మాసనంలో ధ్యానముద్రలో కూర్చున్న సాధువుగారు ఆ గుహలో అన్నపూర్ణ పీఠాన్ని స్థాపించారు.

జుత్తూ గెడ్డమూ బాగా నెరసిన సాధువుగారిని పెద్దస్వామి అనీ, పద్మాసనంలో కూర్చొని ధ్యానముద్రలోనున్న సాధువు గారిని చిన్నస్వామి అనీ కూడా అక్కడి జనం పిలుస్తారు. సీతారామయ్య మాత్రం ఇద్దర్నీ స్వామీ, స్వామీ అనే పిలుస్తాడు. ఆ ఆశ్రమంలో మూడోవ్యక్తి ఆయనే.

చిన్నస్వామి ఆరేడేళ్ల క్రితం అక్కడ ఆశ్రమాన్ని నెలకొల్పుతున్న రోజుల్నించి సీతారామయ్యకు ఆ ఆశ్రమంతో అనుబంధం ఏర్పడింది. దాంతో చిన్నస్వామికి

ప్రియమైనవాడు కూడా అయినాడు. నెమ్మదయినవాడు, సహాయశీలి అయిన సీతారామయ్య ఆ చుట్టుప్రక్కల ఊళ్లల్లో మంచిపేరు ఉన్నవాడు. భూమి, పుట్రా ఉన్న రైతు. కుటుంబంలో గొడవల వల్ల ఇప్పుడు గత కొద్దినెలలుగా ఇంటిపట్టునకాక ఎప్పుడూ ఆశ్రమంలోనే ఉంటున్నాడు. పగటిపూట ఒకసారి, దగ్గర్లోనే పదిహేన్నిమిషాలు నడక దూరంలో ఉన్న ఊళ్లోని తన ఇంటికి వెళ్లి అన్నం తిని బట్టలు మార్చుకుని వచ్చేస్తాడు. పగలు ఆ గంటసేపే అతడు ఇంట్లో ఉండేది. కొండ లోయల్లో ఈ ఆశ్రమంలో ఉంటున్న తాము అంటే సీతారామయ్యకు కొండంత ప్రేమ. కుండపోత వర్షంలో సైతం ఇంటిపట్టున ఉండక ఇప్పుడు సీతారామయ్య ఆ ఆశ్రమానికి రావడం మామూలుగా అయితే వింతేమీ కాదు. కాని మధ్యాహ్నం మా లచ్చిమి వచ్చి భర్త ఇల్లు పట్టించుకోకుండా తిరుగుతున్న వైనం చెప్పుకుని కన్నీళ్లు పెట్టుకున్న తర్వాత పెద్దస్వామి విచికిత్సలో పడ్డారు. సంసారాన్ని నిర్లక్ష్యం చేసిన సీతారామయ్య ప్రవర్తన పట్ల మనసు కల్లోలపడసాగింది. ఈ కుండపోత వర్షంగాని, పెల్లుబికివస్తున్న వెల్లువగాని తమకు ఏమీ కాదనుకోవడం కుదరదు కదా. గ్రామానికి దూరంగా ఈ కొండగుహలో తాము ఉంటున్నా గ్రామంలో సంసారజీవితాలు జీవిస్తున్న పెళ్లాంబిడ్డల గురించి సీతారామయ్య పట్టించుకోకుండా ప్రవర్తించడం పెద్దస్వామికి ఇబ్బందిగా ఉంది. పూర్వాపరాలను ముడివేస్తున్న జీవితం కొంతసేపు కేవలం భ్రమలాగ, మరికొంతసేపు మాయలాగ అన్పించినప్పటికీ మాలచ్చిమి కళ్లల్లోనించి జారిన కన్నీళ్లు మాత్రం కళ్లల్లో కదులుతూనే ఉన్నాయి. ఉదయం మాలచ్చిమి పూజకోసం వచ్చి, ఇతర భక్తులు పూజలు ముగించి వెళ్లిపోయేవరకు ఆగి, చిన్నస్వామి పాదాల మీదపడి తన ఆవేదనంతా చెప్పుకున్నప్పుడు పెద్దస్వామి అంతదూరం నుండి కథంతా విన్నారు. మాలచ్చిమి కన్నీళ్లు తన మనసులోకి ప్రవహించినట్లయింది.

ఈ అందమైన లోయనే, వేసవికాలం సైతం కొండల్లోంచి ప్రవహించే సెలయేరుని, ప్రకృతి వరప్రసాదమైన విశాలమైన గుహని ఆరేడేళ్ల క్రితం తొలిసారి చూసినప్పుడు ఇది క్షేత్రంలాగా కన్పించసాగింది. పుణ్యక్షేత్రాల దర్శనంలో దేశం నలుమూలలా ఏళ్ల తరబడి యాత్రలు చేసిన చిన్నస్వామికి అక్కడ కొంతకాలం ఒక మజిలీ చెయ్యాలనిపించింది. వెంటనే అక్కడ ఒక పాక వేయించారు. ఆనాటి నుండి సీతారామయ్య చిన్నస్వామికి అనుచరుడిగా ఉండి ఏ వస్తువు కావాలన్నా సమకూర్చి పెట్టూ సహాయపడుతున్నాడు. ఆ పాక ఇప్పుడు యాగశాల అయింది. దగ్గర్లోనే ఒక నుయ్యి తవ్వించారు. ఆ సహాయం అంతా సీతారామయ్యదే. యాగశాలలో ఓ

శుభముహూర్తాన హోమగుండం ఏర్పాటు చేసారు చిన్నస్వామి.

యాగశాలకు ఎదురుగా కాళీస్థలంలో పూలమొక్కలు, ఔషధపు మొక్కలతో అందమైన తోటను పెంచారు చిన్నస్వామి. ఇప్పుడు అక్కడకు వచ్చే భక్తులకు ఆ పూలతోటే ఒక దివ్యలీలగా కన్పిస్తుంది. సాధువుగారు అక్కడ అడుగు పెట్టకపూర్వం అది జంతువులు మెసిలే అడవి. ఇప్పుడది అన్నపూర్ణ పీఠం, దర్శనీయ పుణ్యక్షేత్రం అయింది.

సాధువుగారి దీక్షతో ఆ చుట్టుప్రక్కల గ్రామస్థులతో కొత్త సంచలనం రేకెత్తింది. కలిగిన కుంటుంబాలకు చెందిన పెద్దమనుషులు వచ్చి స్వామిని దర్శనం చేసుకొనేవాళ్లు. పళ్లూ, పూలూ తెచ్చి ఇచ్చేవాళ్లు. తమ కష్టసుఖాలు చెప్పుకునేవాళ్లు. వాళ్లలో కొందరు స్వామి నోటిమాట వినటంకోసమే వచ్చి వారితో గంటలు గంటలు ఆశ్రమంలో గడిపి వెళ్లేవాళ్లు.

నిత్యాగ్ని హోత్రం ప్రారంభించిన కొత్తలోనే గుహలో కాశీ అన్నపూర్ణ పీఠాన్ని స్థాపించారు చిన్నస్వామి. సకల ధార్మిక లాంఛనాలతో, భారీఎత్తున అన్నదానంతో ఆ ఉత్సవం ఘనంగా, హర్షోత్సాహ వాతావరణంలో సాగింది. ఈ వికాసం అన్ని దశలలో స్వామికి సీతారామయ్య సన్నిహితంగా ఉన్నాడు. తనకున్నది ఇచ్చి, అన్ని సమయాలలో, అన్నివిధాలా సహకరిస్తూ అక్కడే ఆ ఆశ్రమానికే అంకితమైపోయినాడు సీతారామయ్య. అయినా పండగ రోజుల్లోనో, ఉత్సవ సందర్భాలలోనో తప్ప సీతారామయ్య భోజనం మాత్రం తన ఇంటిలోనే. రాత్రిపూట పొద్దుపోయినా సరే సాధారణంగా భోజనానికి ఇంటికే వెళ్లిపోతాడు.

తర్వాత రోజుల్లో ఇటీవల, ఓ ఏడాదికి పైనే అవుతుంది, ఈ పెద్దస్వామి వచ్చారు. వయసులో బాగా పెద్దవారు. జుత్తు నెరసిపోయింది. అయినా వారి కళ్లలో చూపు అఖండజ్యోతిలా ఆకర్షిస్తుంది. ఎన్నెన్నో చెప్పుకోవాలని వెళ్లే భక్తులు వారి ముందుకొంచెంసేపు నుంచుని, నోరువిప్పకుండా, వారి పాదాలకు సాష్టాంగ ప్రణామాలు చేసి సంతోషంగా వెనక్కి తిరిగి వెళ్లిపోతారు.

యాగశాల లోపలవరకు వర్షపుజల్లులు రావటంతో ఇంతవరకు ధ్యానముద్రలో కూర్చున్న చిన్నస్వామి ధ్యానం ముగించి లేచి నుంచున్నారు. హరికేన్ దీపం ప్రక్కనే ఉన్న పడకకుర్చీలో కూర్చుని బల్లమీది పుస్తకాన్ని తీసుకున్నారు. అక్కడ ఆ ముగ్గురిలోను చిన్నస్వామి పుస్తకపఠనాసక్తి కలవారు. సంస్కృతాంధ్రాంగ్ల భాషలలోను, తమిళంలోను విద్వాంసులాయన. చక్కని హిందీ మాట్లాడుతారు. మీరా, కబీర్ భజనలు, దోహాలు పాడతారాయన. వేదాలు, పురాణాలు, ఉపనిషత్తులు

మొదలుకొని ప్రపంచంలోని వివిధ మతగ్రంథాలు, తత్త్వశాస్త్రాలు చదువుతుంటారాయన. పూర్వాశ్రమంలో ఆయన తమిళనాడులో ఓ విశ్వ విద్యాలయంలో లెక్చరర్‌గా కొన్నాళ్లు పనిచేశారని చెప్పుకుంటారు.

అంతటి ప్రతిభావంతుడైన చిన్నస్వామి అన్నపూర్ణ కావిడిని భుజాన వేసుకొని గంటలు గణగణ మోగుతుంటే, శంఖనాదం మధ్య మధ్య వినిపిస్తూ, గ్రామంలో వీధులన్నీ తిరిగి బిక్షతెచ్చి లలితా సహస్రనామాలు జపిస్తూ, అన్నపూర్ణ ఆరాధనోత్సవాలు నిత్యంచేస్తునే ఉన్నారు. చిన్నస్వామి వయసుకూడా ఏభయ్యేళ్లకు మించి ఉండవు. ఈ బిక్షకోసం వారానికోరోజు ఒక్కో గ్రామానికి పోతారాయన. ఊళ్లో అన్నపూర్ణ కావిడితో కన్పించే ఆ దృశ్యాన్ని చూడటమే ఒక మహాభాగ్యం అన్పిస్తుంది. దేవీ అన్నపూర్ణ మహాత్మ్యం ఆయన ముఖాన చిరునవ్వుగా కన్పిస్తుంది. ఆ భుజాన మోస్తున్న అన్నపూర్ణ ఇత్తడి గంగాళాలు మెరుస్తూ ఉంటాయి. ఆ బిక్ష నిండిన ఆ కావిడిని చిన్నస్వామి పూలకావిడిలా మోస్తుంటారు.

అగ్నికుండంలో మెరుస్తున్న నీలం జ్వాల. యాగశాల లోపలికి కొట్టుకొస్తున్న వర్షపు జల్లులు.

వర్షంలో నిండా తడిసి 'వచ్చేశాను స్వామీ' అని సంతోషపడిపోతున్న సీతారామయ్య ఓ వారానికి సరిపడే పచ్చి గంజాయాకు తెచ్చాడు. ఒళ్లు తుడుచుకుని అగ్నికుండం ముందుకూర్చుని లోపలి చలి తగ్గించుకోవటానికన్నట్టు సీతారామయ్య చిలుము నింపి వెలిగించాడు. హరిఓం తత్‌సత్ అని జలపాతానికి మించిన ధ్వనితో భగవాన్ సంస్మరణ చేసి చిలుమును అందంగా పట్టుకుని రెండు చేతుల్ని పైకెత్తి మెల్లగా తలమీంచి కిందికి దించి, పెదవుల దగ్గరకు తెచ్చి, కొంచెంసేపు మెల్లమెల్లగా చిలుమును పీల్చి విడుస్తూ ఆఖరి పట్టు గట్టిగా పట్టి, చాలాసేపు ఊపిరి బిగపట్టి, కళ్లు మూసుకుని కూర్చున్నాడు. బల్లమీద మేనువాల్చిన పెద్దస్వామి చిలుము తమ వంతుకు వస్తున్నట్టు గమనించి లేచి సర్దుకుకూర్చున్నారు. సీతారామయ్య తెచ్చి ఇచ్చిన చిలుమును ప్రేమతో అందుకున్నారాయన.

బయట వర్షం కుండపోతగా కురుస్తున్నది. యాగశాలలో అగ్నికుండం మండుతున్నది. చిన్నస్వామి చేతిలో పుస్తకంతో ఇంకా సమాధి అవస్థలోనే ఉన్నారు.

పెద్దస్వామికి కళ్లముందు పదేపదే మాలచ్చిమి కన్పిస్తున్నది. ఆ కావ్యంలో ప్రధాన పాత్ర సీతారామయ్య. మాలచ్చిమి అతడి సేవాభాగ్యానికి నోచుకున్న ఇల్లాలు. ఆమె తన నాలుగు పుష్కరాల జీవితంలో ముప్పాతికకాలం తన కుటుంబగౌరవం కోసమే బతికింది. ఇప్పుడు తండ్రికీ కొడుక్కీ మధ్య పట్టింపులతో ఇరుక్కుపోయింది.

ఆమె కళ్లచుట్టూ ఏర్పడిన నల్లనినీడల్లో చేరుకున్న వ్యధా మాలిన్యం, చూపుల్లో కన్నీళ్లు, కొడుకు పట్ల అంతర్వాహిని ఆమె ప్రేమ, ఆమె వేదన, భర్తను ఒప్పించలేని ఆమె నిస్సహాయత, భర్త అంగీకారం కోసం ఆమెప్రార్థన, అన్నీ గుర్తొచ్చి కుంగదీస్తున్నాయి పెద్దస్వామిని.

శేషజీవితాన్ని కరుణతో ప్రశాంతం చేసుకోవాలనీ, సేవకు అంకితం చేసుకోవాలనీ సాగిస్తున్న సన్యాసంలో నిత్యం కండ్లముందు కన్పించే సంసార సాగర సంక్షోభాలు...

ఏ బంధాలనుండి విముక్తికోసం జంతుభయంతో కూడిన పర్వతారణ్యమైన ఈ లోయలో అడుగు పెట్టాడో — అవే బంధాలు — అవే ద్వంద్వాలు — అవే ఆకర్షణలు తనను ఇక్కడ బంధిస్తున్నాయి.

పూలతోట. తను పువ్వుకాదు. తుమ్మెద కాదు. సూర్యచంద్రులూ తారకలూ కాదు తాను. వాయువూ ఆకాశమూ కాదు. తీర్థక్షేత్రమూ మూలవిరాట్టూ కాదు. అవేవీ వద్దు తనకు. తను సామాన్యప్రేక్షకుడు. అంతే. స్వార్థమూ వద్దు. పరమార్థమూ వద్దు. ఈ రోజు పెంచడం రేపు తుంచడం జరుగుతున్నదే. ఈ క్షణం మురిసిపోవడం మరుక్షణం మరచిపోవడం సాగుతున్నదే. ఈనాడు స్వీకారం మరునాడు తిరస్కారం. అవును నిజం రెండూ మమూలే. ఉన్నవే. భగవాన్! అంతా నువ్వే. నీ లీలా వినోదమే భగవాన్! నీ సృష్టి మహాత్యమే!

మేఘం బరువు మోసుకుంటూ వచ్చింది. కన్నీళ్లు కురిసింది. ఆ చల్లదనమూ, ఆ చిలకరింపూ కరుణార్ద్రమై స్మృతి చిత్రం అయింది... మాలచ్చిమి. తన తల్లి రూపు అదే.

గతం పెద్దస్వామికి ప్రత్యక్షమయింది. తనకు తల్లి ఉంది. తండ్రి ఉన్నాడు. పెరిగి పెద్దవాడయ్యాడు. ఇంటికి కోడలు వచ్చింది. నాలుగోమనిషి ప్రపంచ సౌందర్యాన్నంతా తనతోపాటు తెచ్చింది. ఇల్లంతా పూలపరిమళాలతో నిండి పోయింది. ఒక పసివాడు ఉదయించాడు. ఆ లోకాల దరహాసాల కన్నీటిని మోసుకొని వచ్చాడు. అంతలోనే దారితప్పి వచ్చినట్టు వచ్చిన చోటుకే ఆ పరలోకానికే వెళ్లిపోయాడు. వాడిని వెతుక్కుంటూ ఆ మాతృమూర్తి ఈ లోకాన్ని త్యజించి వెళ్లిపోయింది. పెద్దలు పెదవి విరుచుకుంటూ ఆ పెద్దలోకానికే వెళ్లిపోయారు. పెద్దస్వామికి జ్ఞాపకాలు తెరమీద నాలుగు బొమ్మలు కనిపించి అదృశ్యమైపోయాయి. కాషాయాంబరాలు వరించివచ్చాయి. అవి నడిపించినట్టల్లా నడుస్తున్నాడాయన. తీర్థయాత్రికుడిగా ఒక క్షేత్రం నించి మరొక క్షేత్రానికి. ఆ దార్లో ఇది మజిలీ. దాదాపు

ఏడాదికి పైనే అయింది. ఇక్కడే ఉండిపోయాడు. ఈ సెలయేరు. ఈ కొండ గుహ, యాగశాల, పూజకోసం వచ్చే భక్తులూ — వాళ్లప్రేమ.

అట్లాగే వచ్చింది ఉదయం మాలచ్చిమి. చిన్నస్వామితో తన పట్ల, ఇంటి పట్ల భర్త సీతారామయ్య నిరాదరణ గురించి కన్నీళ్లతో చెప్పుకున్నప్పుడు మౌనంగా విన్నాడు పెద్దస్వామి.

సీతారామయ్యకు అన్ని అనుబంధాలు ఉన్నాయి. కూతుళ్లు కాపురాలు చేస్తున్నారు. కొడుకు ఉద్యోగం చేస్తున్నాడు. ఊళ్లో గౌరవ మర్యాదలున్న కుటుంబం. పదెకరాల పంటపొలం. పాడిపశువులు. పనివాళ్లు. అయినా అవేవీ పట్టించుకోవటం లేదు సీతారామయ్య. ఇంటి పనులు, వ్యవసాయం, ఇతర మంచీ చెడ్డ అన్నీ ఇప్పుడు మాలచ్చిమి నెత్తిమీదే పడ్డాయి. సీతారామయ్య — ఇక్కడ సన్యాస సహచర్యం బాధ్యతారాహిత్యమే కాకుండా అమానుషంగా కూడా ఉంది. పిల్లలూ, సంసారమూ, ఇల్లూ, బతుకూ ఏమీ వద్దనుకుని ఇక్కడ ఉంటున్నాడు. మాలచ్చిమి కన్నీళ్ల భాష కలత పెట్టున్నది.

వర్షం మరింత ఉధృతమైంది. వర్షపునీళ్లు యాగశాలను చుట్టుముట్టి సెలయేర్లో కలిసిపోతున్నాయి.

తాగడం వంటి అలవాట్లు మొదలయ్యాయి. ఇంటిని, భార్యని, కొడుకుని, కూతుళ్లని, మనుమళ్ని, ఇంకా బంధువుల్ని — చివరకు స్నేహితుల్ని సైతం ఇప్పుడు సీతారామయ్య పట్టించుకోడు. సీతారామయ్యతో పని ఉంటే వచ్చిన — వాళ్లతో తలూపటం — అవుననో కాదనో తప్ప — పెదవి విప్పి మాటాట్టం కూడా లేదు.

కొడుకు ప్రవర్తనకి తల్లే బాధ్యురాలని మాలచ్చిమి మీద కోపం. తల్లి కాదంటే కొడుకు తురకపిల్లని పెళ్లాడేవాడు కాదనీ, తల్లికి తెలిసే జరిగిందనీ, తల్లీ కొడుకులు కలిసే ఈ నాటకం ఆడారనీ సీతారామయ్య కోపం.

కొడుకు అర్ధరాత్రిపూట వచ్చి 'నన్ను నమ్మి తల్లినీ తండ్రినీ ఆస్తినీ బంధువుల్నీ విడిచిపెట్టి వచ్చేసింది. నేను మోసం చేస్తే చచ్చిపోతుంది' అని తల్లితో చెప్పుకున్నప్పుడు, వాడి కన్నీటిని చూసి నోరు విప్పలేక పోయింది మాలచ్చిమి. తల్లి పాదాలకు నమస్కరించి, ఆమె పాదధూళిని ఫాలానికి అద్దుకుని, తల్లి ఆశీస్సులను స్వీకరించి వెళ్లిపోయాడు కొడుకు. తండ్రికి తెలియకుండా ఈ రాకపోకలు జరిగాయి.

కోడలును తల్లికి చూపించటానికి స్నేహితుని ఇంట్లో పొరుగూర్లో మళ్లీ వాళ్లు కలుసుకున్నారు. గుడిలో అమ్మవారిని చూసినంత సంతోషపడింది మాలచ్చిమి. పిల్లలకు ధైర్యం చెప్పింది. బాపుకు ఈ కోపం ఎన్నాళ్లో ఉండదులే అని భరోసా

ఇచ్చింది మాలచ్చిమి. తను ప్రేమతో కోడల్ని గుండెల్లోకి తీసుకుని, నుదుట ముద్దుపెట్టి, ఆశీర్వదించింది. ఆ పిల్ల, అత్తమ్మ పాదాలమీదపడి నమస్కరించింది. అత్తమ్మ వెళ్లిపోతుంటే ఆ పిల్ల కన్నీళ్లు పెట్టుకుంది.

సీతారామయ్య భంగు తొరుపుతున్నాడు. భంగు ఎంత ఎక్కువసేపు తొరిపితే రుచి అంత ఎక్కువగా ఉంటుందంటారు. ఒక పద్ధతి ప్రకారం తయారుచెయ్యాలి. ఆ పద్ధతి సీతారామయ్యకు తెలుసు. యాగశాల తొలిరోజుల్లో వచ్చి ఓ నెలదినాలు పాటు ఉన్న ఒక సాధువుగారు ఈ పద్ధతి నేర్పారు. సీతారామయ్యకు మాత్రమే దాని పాలు అనుపాలు అలవాటయింది. చిన్నస్వామికి ఆ రుచుల భేదం పట్టింపులేదు. రాత్రిపూట ఆయన తినేవి పళ్లే. లేదా ఇట్లాంటి పానీయం. ఆ ఇద్దరు స్వాములూ ఒక పూట భోజనమే. ఉదయం టీ. సాయంత్రం టీ తప్పవు. పూజకోసం వచ్చే పళ్లూ, కాయలూ — చాలా వరకు మళ్లీ భక్తులకు పంచిపెట్టేవే.

ప్రాపంచిక అనుబంధాలు సద్దుచేస్తున్న అలజడి అర్థమవుతున్నది. పెద్దస్వామిలో ద్వంద్వాలు ఘర్షణ పడుతున్నాయి.

మంచీ చెడూ ఉన్నట్టా లేనట్టా?

సీతారామయ్యకు బుద్ధులు చెప్పమని మాలచ్చిమి కోరింది.

సీతారామయ్యకు తెలియనిదీ, తనకు తెలిసినదీ ఏమిటి?

తనెవ్వరు? చెప్పేదేమిటి? చెప్పవలసిన దెవరికి? ఎందుకు? అన్నీ చెప్పేవాడూ చేయించేవాడూ తనేనా?

సీతారామయ్య కుటుంబాన్ని ఎందుకు పట్టించుకోవడం లేదు.

సీతారామయ్య ఇప్పుడు తిండికోసమన్నా ఇంటికిపోతున్నాడు. నిద్రకి ఇంటికే పోతున్నాడు. తను చెప్పిన తర్వాత మొండికేసి కాషాయాంబరాలే వేసుకుంటేనో! నాకీ సంసారం వద్దు స్వామీ నేను ఇంక ఇంటి గడప తొక్కను స్వామీ. ఇక్కడే ఉంటాను అని బుద్ధి మార్చుకుంటే?

తనలోని ప్రాపంచిక జ్ఞానం కొట్లాడుతున్నది.

భార్య పట్ల సీతారామయ్య ప్రవర్తన బాగాలేదు. ఆమెతో కొన్నిఏళ్లుగా సీతారామయ్య మాటాడటం లేదట. తప్పుకాదా?

నీకు సన్యాసమే కావాల్నా... వచ్చెయ్. కాషాయాంబరాలు ఇవిగో. తీసుకో. ఇంటినీ, ప్రపంచాన్నీ మరచిపో. అన్నీ తెంచుకో. సర్వస్వం వదులుకో. నీ రాగ ద్వేషాలు వదులుకో. కానీ సంసారపు దుస్తుల్లోనే ఉన్నప్పుడు సమాజ నియమాలు పాటించు. తప్పదు. అని ఓ పక్క మనసు హెచ్చరికలు పలికించాలని తాపత్రయ

పడుతున్నది.

ఉదయం మాలచ్చిమి పూజకోసం వచ్చి పూజ రద్దీ తగ్గినంత వరకూ ఉండి చిన్నస్వామితో తన ఆవేదన వెళ్ళగక్కుకున్న దృశ్యం పదేపదే మనసులో కదులుతున్నందువల్ల ఈ విచికిత్స. ఆమె మాటమాధుర్యం ముందు, మాతృత్వగరిమ ముందు ప్రపంచమంతా అల్పంగా కన్పించసాగింది. దేవీ అన్నపూర్ణ రూపంతో వెలిగింది.

కొడుకును గడపతొక్కవద్దని సీతారామయ్య కోప్పడ్డాడు. ముస్లిం అమ్మాయిని కొడుకు పెళ్లాడటం అన్నదే నేరమయింది. సంఘంలో తన పరువు మర్యాదలు కుప్పకూలిపోయాయని కుంగిపోయాడు సీతారామయ్య. ఆ కోపంతో ఆస్తిని కూతుళ్ల పేర రాసేశాడు. అప్పట్నించి ఊళ్లో మనుషుల్నించి తప్పించుకుని తిరగటానికి ఈ సాధు సాంగత్యం దొరికింది. చిల్లర సన్యాసులతో తిరిగి గంజాయి చిలుము, భంగు అలవాటు పడ్డాడు.

'ఫరవాలేదమ్మా అంతా బాగానే జరుగుతుంది. చెబుతాలే' అని మాలచ్చిమికి ధైర్యం చెప్పినప్పుడు ఆమె పరమానంద భరితురాలయింది. ఆనందాశ్రువులు ఆమె కళ్లల్లోంచి జలజల రాలాయి. ఆ దృశ్యం చూసిన పెద్ద స్వామి ఆలోచనలో పడ్డాడు.

వర్షం తగ్గింది. గాలి హెచ్చింది. యాగశాల పైకప్పు గాలులకి ఊగిపోతున్నది. పైకప్పు కర్రలు కొన్ని పుచ్చిపోయి విరిగిపోవటంవల్లా, తాత్కాలికం అనుకుని ఏర్పాటు చేసిన యాగశాల నాలుగేళ్లుగా అట్లాగే ఉండటంవల్లా, గట్టిదనం పోయింది. ఈ గాలులకి కూలుతుందేమో అని చాలాసార్లు అనిపించింది. పైకప్పు పడిపోకుండా కట్టెలతో దన్ను పెట్టారు. త్వరలోనే యాగశాలని సిమెంట్‌గోడలతో, పెంకు పైకప్పుతో నిర్మించే ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఈ వర్షాకాలం ఇంకో రెండునెలలు ఇట్లా నడిపిస్తే వర్షాలు తగ్గిన వెంటనే యాగశాల పని మొదలు పెట్టాలి. పునాదులు రాతి కట్టడం పని ఏడాది కిందే పూర్తయింది. ఇప్పుడు గోడలు లేవాలి. పై కప్పు వెయ్యాలి. నిర్మాణం కావాలి. ఆ దీక్షతోనే ఉన్నారు చిన్నస్వామి. భక్తులు రకరకాల సలహాలతో సహాయసహకారాలతో ఎప్పుడెప్పుడూ స్వామీ అని అడుగుతున్నారు. అంతా ఆ దేవీలీలగానే ఆమె కావాలనుకున్నప్పుడే వాటంతటవే అన్నీ జరుగుతున్నాయి. ఇక ముందుకూడా అట్లాగే జరుగుతాయి అంటున్నారు చిన్న స్వామి.

అగ్నికుండంలో కాలుతున్న పెద్దపెద్దమానుల మధ్య చిన్న జ్వాల నీలంగా పైకెగసి నాట్యం చేస్తున్నది. నివురు రాల్తున్నది. యాగశాల నాలుగువేపులా అగ్నికుండం వెలుగూ, వేడీ వ్యాపించి వర్షం చలిగాలులకు ఉష్ణస్పర్శ కలిగిస్తున్నది.

వాలుకుర్చీలో కూర్చున్న చిన్నస్వామి చిన్నపిల్లవాడిలా నవ్వుతూ సీతారామయ్య భంగు తయారీ నిమగ్నతని వినోదిస్తున్నాడు. సీతారామయ్య మధ్యమధ్య ప్రపంచం ముచ్చట్లు వారి చెవిన వేస్తున్నాడు. ఆ ఇద్దరు సాధువులు రాత్రిపూట భోజనం చేయరు. పాలో, పండ్ల రసమో — ఓ గ్లాసుడు చాలు. భంగు ఇవేళ వారి రాత్రి పానీయం. సాధువుల సేవలో నిండామునిగిన సీతారామయ్య రాత్రిపూట పానీయం తయారుచేసి వారికి ఇచ్చి — తర్వాత ఇంటికి వెళ్లిపోతాడు. అది సీతారామయ్య నిత్యకృత్యం. రెండోరోజు ఉదయమే ఇంటి దగ్గరే స్నానాదులు ముగించి ఎనిమిది గంటలలోపే యాగశాలకి వస్తాడు. తనకి ఇక్కడ చేతినిండా పనులే.

ఓం ఓం ఓం అని ప్రణవం ప్రతిధ్వనించేట్టు నినదించి సీతారామయ్య అగ్నికుండంలో నైవేద్యంగా భంగును కొంచెమంత సమర్పించి చేతులు జోడించి భగవాన్... భగవాన్... భగవాన్ అని భగవాన్ నామస్మరణచేసి ఓ గ్లాసులో పెద్దస్వామికి భంగుపానీయాన్ని అందించాడు. సీతారామయ్య వేరే గ్లాసుతో పానీయాన్ని చిన్న చిన్నగా సేవించటం మొదలుపెట్టాడు.

కెంపురంగు చేనేతచీర కట్టుకుంది మాలచ్చిమి. పసుపు రాసుకున్న శరీరం. తలకు స్నానంచేసి వదులు జుత్తుముడి వేలాడుతున్నది. ఎంతటి మహాత్ముణ్ని అయినా అనసూయలాగ పసిపిల్లల్ని చేసేయగల మాతృశోభతో వంగపండు రంగు శరీరం. సన్నగా తేలిక శరీరం. ఇంకా తేలికపాటి తేటతెల్లని చూపులు. స్వప్నాలలో ప్రత్యక్షమయ్యే అన్నపూర్ణ ఆమె.

వర్షం తగ్గిపోయింది. మేఘాలు తేలిపోయాయి. ప్రకృతి నిర్మలమయింది. సెలయేర్లో చంద్రికలు ప్రవహిస్తున్నాయి. పొలాల్లో నిండిన నీళ్లు వెన్నెలకాంతికి అద్దాల్లా మెరుస్తున్నాయి.

చిన్నస్వామికి ఎదురుగా చాప మీద కూర్చుని 'స్వామీ ఈ గెడ్డ (సెలయేరు) ఎండకాలం కూడా పొంగుతూ పారకూడదా? ఈ వానలు ఇలాగే ఎండకాలం కూడా కురవకూడదా!' అన్నాడు సీతారామయ్య.

ప్రపంచం అంతా అందంగా సంతోషంగా ఉంది సీతారామయ్యకి.

చిన్నస్వామి వింటున్నాడు. ఆ సీతారామయ్య కోరికలు మామూలే. చిన్న పిల్లవాడిని చూసినట్టుగా చూస్తున్నారు. స్వామి సమాధానం చెప్పలేదు. అది వారి పద్ధతి. మౌనమే వారి భాష. అది తెలిసిందే. ఆ మౌనంతోనే తనకు సమాధానం దొరుకుతుంది.

'అంతా ఆ పరమేశ్వరుని లీలావిలాసం. ఈ గెడ్డ ఇప్పుడు వడ్డులొరుసుకుని

నిండా పారుతుందా? కొండమీంచి కిందికి ఉరుకుతుందా? ఎండాకాలం దీని రూపమే మారిపోతుంది.' అని ఉత్సాహంతో మాట్లాడుతున్నాడు. చిన్నస్వామి మౌనం, పరధ్యానం చూస్తే ఆయన సత్యతత్త్వ చింతనలో నిమగ్నమైనట్టుగా ఉంది.

సెలయేరు ఉప్పొంగి ప్రవహిస్తుంది. ఈ నవ వెల్లువ దారిపొడవునా సర్వకల్మషాలనీ క్షాళనచేస్తూ వస్తుంది. కొన్నిసార్లు ప్రమాదాలని మోసుకొస్తుంది. కొన్నాళ్లకు ప్రవాహం నిర్మలం అవుతుంది. నీళ్లు స్వచ్ఛమవుతాయి. ఉధృతం తగ్గుతుంది. మాతృదేవతలా కన్పిస్తుంది.

జలపాతం పాట కోటిగొంతులతో వినిపిస్తున్నది.

మత్తెక్కిన తాగుబోతులా నక్కలు ఊళలు వేస్తున్నాయి.

మాలచ్చిమికి కొడుకంటే వల్లమాలిన ప్రేమ. కాని కొడుకు మాలచ్చిమి పరువూ ప్రతిష్టా ఏముంచాడు స్వామీ? జాతీనీతీ ఏం నిలబెట్టాడు స్వామీ?

'తురకల కూడు తిన్నాడు. నా కళ్లెదుట పడుంటే — బలిద్దును'

మత్తులో వస్తున్నట్టున్నాయి మాటలు.

చిన్నస్వామి వింటున్నట్టున్నారు.

బాధ... సంతోషం... సీతారామయ్యని కల్లోలపరుస్తున్నాయి.

'కూతుళ్లిద్దరూ, కళ్లు పండగ్గా కాపురాలు చేసుకుంటున్నారా? మాలచ్చిమికి ఆ సంతోషం ఉండొద్దా? ఆస్తి వాళ్లపేర రాసేస్తానంటే పస్తులుచేసింది. పో పొమ్మని రాసేశాను.

పరిత్యక్తసుతుడు కర్ణునికోసం విలపించే కుంతి జ్ఞాపకం వచ్చింది చిన్నస్వామికి.

పుట్టిన్నాడే చచ్చాడనుకుంటాను స్వామీ — చనిపోతే ఏం చేసేవాడిని స్వామీ. ఆనాడు చనిపోయినా బాగుండేది. ఇవేళ ఈ దుఃఖం, ఊళ్లో ఈ అవమానం పడాలని భగవంతుడు నానొసట రాశాడు స్వామీ' సీతారామయ్య తన దిగులునీ, తన ఆవేశాన్నీ కలగలిపి చెప్పుకుంటున్నాడు.

భార్యని మాలచ్చిమీ అని నోరారా పిలవడం మానేశాడు. మాటాడటం మానేశాడు. నాలుగేళ్లుగా ఇదే ధోరణి. వ్యవసాయం కూడా పట్టించుకోడు. మాలచ్చిమే వ్యవసాయం చేయించుకుంటున్నది.

కొడుకు చేసింది ఆమెకు తప్పు అనిపించలేదు. ఎంత వెతికినా ఏ తప్పూ కనిపించలేదు. పైగా ఆ పిల్లను చూసిన తర్వాత దేవతే తమ ఇంట్లో అడుగు పెట్టిందన్న సంతోషం. ఆ పిల్లను తన ఇంటికి ఈ కాన్పు సమయంలోనన్నా తెచ్చుకోలేకపోతున్నందుకే ఆమె బాధ ఇప్పుడు.

దానికి తోడు భర్త మూర్ఖత్వం, నిరాదరణ, బైరాగులతో తిరగడం, పిల్లల్ని పట్టించుకోకపోవడం — అంతా కొత్తబాధగా తన నెత్తిమీద పడింది. ఇంటిపనులు, వ్యవసాయపుపనులు, గ్రామంలో శుభకార్యాలు, మంచీచెడ్డా — తను ఒంటరిదయి పోయింది.

మానవ మమతల్లోకి ఈ మాలిన్యం, ఈ అసహనం మూలంగా క్షోభ. రెక్కలు వచ్చిన పక్షిని స్వతంత్రంగా బతకనివ్వటమే ప్రకృతి ధర్మం. యవ్వనం కోరికలు వేరు. ఆ ప్రవాహవేగం వేరు. దాన్ని నిరోధించబూనడం తెలివితక్కువ. సీతారామయ్య కొడుకు చేసింది మంచిపనే. ప్రేమ నిర్మలమైనకొద్దీ పవిత్రమౌతుంది. తమలోనే కాకుండా చుట్టూ ఉన్న సమాజాన్ని పరిమళభరితం చేస్తుంది. ఇప్పుడు ఈ ప్రకృతి అంతా పర్వతారణ్య గాధ పరిమళాలే. కొడుకు స్వతంత్రంగా జీవిస్తున్నాడు. కొత్తప్రపంచంలో జీవిస్తున్నాడు. కొత్త బాంధవ్యాల మధ్య పడ్డాడు. కొత్త అనుబంధాలను అతడు అన్వేషిస్తున్నాడు.

ఈశ్వర్ అల్లా తేరే నామ్
సబ్ కో సన్మతి దే భగవాన్

కొత్తపాటలు పాడుకుంటున్నాడు. ఈ కొత్తజీవితాన్ని స్వీకరించటానికి సాహసం కావాలి. సంకల్పబలం కావాలి. అతడు మనోహరమైన పూలతోటను వేస్తున్నాడు. సంకుచితమైన హద్దుల్నించి, సనాతనమైన అజ్ఞానంనించి బైటపడి విశ్వభావన వేపు నడక సాగిస్తున్నాడు.

కారణాలు చెప్పి సీతారామయ్యకు హితబోధ చెయ్యాలని లేదు. పెద్దస్వామికి, తన మౌనమే అతని అంతరంగంలో అగ్నిజ్వాలల్ని సృష్టించి కాలుష్యాన్ని దహించి వేయగలదని వారికి తెలుసు. అందుచేతనే పెద్దస్వామి ముఖం మీద ఆ ప్రశాంతం.

* * *

వర్షం కడిగిన ప్రకృతి హరితవర్ణం మీద, తూర్పు ఆకాశపు పగడాల రాసుల కింద, సువర్ణ ఛాయల జలపాతం ప్రపంచమీద కురుస్తున్నది. నెమళ్లు లేచి ప్రార్థనలు చేసుకుంటూ ఆశ్రమం సమీపంలోని చింతచెట్ల కింద ఆడుకుంటున్నాయి.

చిన్నస్వామి దేవీపూజలో ఉన్నారు. పెద్దస్వామి ఆశ్రమానికి దిగువగా ఉన్న గెడ్డలో స్నానంచేసి సూర్యభగవానునికి అర్ఘ్యం విడిచి వందనం చేసుకుంటున్నారు. సీతారామయ్య పూలతోటలో పూలు కోస్తున్నాడు.

గెడ్డకి దిగువున దాదాపు ఫర్లాంగ్ దూరంలో కొండమలుపు దగ్గిర ఆశ్రమానికి

పశ్చిమంగా నలుగురైదుగురు మనుషులు చేరి కేకలు వేస్తున్నారు. ఆ కేకలకు ఒకసారి అటువేపుచూసి సీతారామయ్య మళ్లీ పూలు కోసుకోవడంలో నిమగ్నుడయిపోయాడు. దూరాన గొడవ ఇంకా ఎక్కువయింది. కొద్ది నిముషాల్లో జనం మరింతమంది చేరారు.

యాగశాల వద్దకు పాలవాడు వచ్చాడు. సీతారామయ్య పాలు కోసం స్టీల్ గిన్నె తెచ్చిపెట్టి, పాలు పోయించుకున్న తర్వాత 'ఏంట్రా అది? అక్కడా జనం?' అని ప్రశ్నించాడు.

'ఆడ మనిషి శవం బాబు, ఎవరో ఏమిటో. నడి వయసు దాటిన మనిషే. గెడ్డలో తేలి వచ్చి చెట్టు దగ్గర చిక్కుపడింది. ఆడమనిషి వంటిమీద గుడ్డన్నా లేదు బాబూ. ఎవరో ఏమిటో' అన్నాడు బాధపడుతూ.

సీతారామయ్య వొళ్లు జలదరించింది. నిలువెల్లా వణికిపోయాడు. ఆడమనిషి. నడివయసు దాటిన మనిషి. మనసులో నీడ. ఆడమనిషి. పాల గిన్నెను ప్రక్కనే పెట్టేసి పరుగెత్తాడు. పాలవాడు ఆశ్చర్యపోతున్నాడు. తడివస్త్రాలతో వస్తున్న పెద్దస్వామి 'పిచ్చివాడిలా పరుగెత్తుతాడే' అని చిన్న పిల్లవాడిలా నవ్వుతున్నారు. సీతారామయ్య పొలంగట్ల మీదుగా మధ్యమధ్య జారిపోతూ, పడిపోతూ, లేస్తూ పరుగెత్తుతున్నాడు. సీతారామయ్య చిన్నపిల్లవాడిలా పరుగెత్తుతూపోవడం తొలిసారిగా చూస్తున్న పెద్దస్వామికి విచిత్రం అనిపించింది. పాలవాడు ఊళ్లో హోటల్‌లో పోయటానికిగాను పాలకావిడి మోసుకుంటూ మరోదారిన వెళ్లిపోయాడు. ఈ ప్రపంచ బంధాలను ఏమీ పట్టించుకోకుండా నెమళ్లు ఆశ్రమం చుట్టూ తిరిగి ఆహారం ఏరుకుంటున్నాయి. చిన్నస్వామి దేవీపూజ కొనసాగుతూనే ఉంది. పెద్దస్వామి నిత్యాగ్ని హోత్రం చుట్టూ, గెడ్డనించి తెచ్చిన నీళ్లతో ఆవుపేడ తీసుకుని అలుకుతున్నారు.

భక్తులు వచ్చేవేళ అవుతున్నది. ఇంక గుహలో దేవీపూజలు మొదలవుతాయి. అవాళ ఆదివారం కావటంవల్ల పూజలు మధ్యాహ్నం రెండు గంటల వరకు నడుస్తాయి. భక్తులు ఒకసారి రావటం మొదలయితే ఇంక తీరిక చిక్కదు. ముగ్గురుకీ చేతినిండా పని.

'ఎవరో ఆడమనిషి స్వామీ. పెద్ద వయసుమనిషే. గెడ్డలో దూకి చచ్చిపోయి నట్టుంది స్వామీ. ఆత్మహత్యే స్వామీ. ఆ మనిషికి ఏ ఆపద వచ్చిందో. ఏ అవమానం వచ్చిందో. మనసు విరిగిపోయింది. చచ్చిపోయింది స్వామీ'.

పెద్దస్వామి వింటున్నారు. ఏ ఆశ్చర్యమూ కనిపించలేదు. ఏ ఆందోళన కనిపించలేదు.

పూవు పూసిందంటే సంతోషపడతావు. ఆ చుట్టూ ఆ లావణ్యాన్ని చూపులతో తాకుతూ తిరుగుతావు. మర్నాడు వాడి రాలిందంటే ఏడ్చి కుంగిపోతావు. అది మనిషి బలహీనత. కాని అదే బతుకు.

ఆ మాటలు ఎవరూ చెప్పలేదు. అక్కడ విశ్వవ్యాప్తమైన మౌనం ఆ పర్వత లోయలో ధ్వనిమాత్రంగా ప్రతిధ్వనించినట్టయింది సీతారామయ్యకి. పక్షులు కలకలరవాలతో, చెట్లఆకులు గలగల దరహాసాలతో నిశ్శబ్ద హృదయంలోకి చొచ్చుకుపోయి ప్రకంపనలను సృష్టిస్తున్నాయి. జ్ఞానం ఆ సమాధి అవస్థనించి మేల్కోవాలి.

'ఇంటికెళ్లి మాలచ్చిమిని చూసొస్తాను స్వామీ' అన్నాడు సీతారామయ్య. ఆ మాటలు మరుగున అతడు చూడాలనుకున్న ఆత్మీయులు ఇంకా చాలామందే ఉన్నట్టు అతడి చూపులు వెతుకసాగాయి.

స్వామి తలూపారు.

సీతారామయ్య త్వరత్వరగా తొందరపడుతూ నడుస్తున్నాడు ఇంటివేపు.

***

– ఆంధ్ర సచిత్ర వార పత్రిక *1 - 12 - 61*